క్లుప్తంగా

నేడు ఏఐజీఈటీఓఏ జిల్లా 4వ సమావేశం

కర్నూలు (న్యూటౌన్): ఆలిండియా గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐజీఈటీఓఏ) జిల్లా 4వ సమావేశం స్థానిక శ్రీనివాసనగర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఏఐజీఈటీఓఏ జిల్లా కార్యదర్శి ఎం.చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ హాజరవుతారని తెలిపారు. 'స్థిరమైన అభివృద్ధి – బీఎస్ఎన్ఎల్ పాత్ర కోసం టెలికాం విప్లవం' అనే అంశంపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను పారబోస్తున్న సెబ్ అధికారి

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ తండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీపై సిబ్బందితో కలిసి దాడి చేసి నిల్వ ఉంచిన 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు బుధవారం తెలిపారు. బట్టీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది వెంకట్‌నాయక్, గోపాల్ నాయక్, విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



ఇనగండ్ల ఆర్బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు.బుధవారం మండలంలోని పోలకల్, ముడుమాల, ఇనగండ్ల గ్రామాలలో పర్యటించి, ఆయా గ్రామాల ఆర్బీకేలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్బీకేల్లోని రికార్డులు, ఎరువులు, మందులు, సంక్షేమ పథకాలకు అర్హులైన రైతుల జాబితాలను తనిఖీ చేసి వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే కియోస్కో పనితీరు పరిశీలించి ఆయన ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను నమోదు చేయించారు. వీఏఏలు రెగ్యులర్‌గా గ్రామాల్లో పర్యటించి ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసే పంటలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఎంపీఈఓలు ఈశ్వర్, వెంకటేష్ ఉన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో బుధవారం తెలంగాణ మద్యాన్ని అక్రంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. సిబ్బందితో కలిసి గ్రామంలో సోదాలు నిర్వహించగా, బత్తిని రంగన్న నుంచి 182 తెలంగాణ రాష్ట్రానికి చెందిన 180 ఎంఎల్ ఆఫీసర్స్ చాయిస్ మద్యం సీసాలు లభించటంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వెల్లడించారు.

వచ్చేనెలలో నర్సుల సంఘం ఎన్నికలు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు జూన్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు స్టాఫ్‌నర్సు యు.ఎం. శాంతిలత, సి. బంగారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏ హాస్పిటల్‌లో ఎంత మంది పనిచేస్తున్నారు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అడహాక్ కమిటీ నియామకం గురించి, ఆరోగ్యశ్రీ పారితోషికం, సరెండర్ లీవ్ బిల్లులు, జీపీఎఫ్ లోన్ బిల్లుల గురించి చర్చిస్తామన్నారు. కాగా శాంతిలత, బంగారిలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సుల ప్రమేయం లేకుండా ఎన్నికలంటూ హడావుడి చేస్తున్నారంటూ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు మంజులబాయి మరో ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉన్నా సమావేశాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సింగ్ సిబ్బంది ఎవ్వరికైనా సమస్యలుంటే మాజీ అధ్యక్షురాలినైన తనకు తెలియజేయాలని కోరారు.

కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోండి

- ఈవీఎంలకు 14, పోస్టల్ బ్యాలెట్లకు 4 టేబుళ్ల ఏర్పాటు
- కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ఈనెల 30 వ తేదీ లోపు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఫారం-18 ని సమర్పించి కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో 2024 సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి అధికారిక ప్రతినిధులతో కౌంటింగ్ నిర్వహణ అంశంపై ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణితో కలిసి ఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో 14 టేబుళ్ల ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు, 4 టేబుళ్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఏజెంట్లకు ఫొటో కలిగిన గుర్తింపు కార్డు ఇస్తున్నట్లు చెప్పారు. కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమన్నారు. కౌంటింగ్ ఏజెంట్ వెరిఫికేషన్ సెంటర్ వద్ద తమ మొబైల్ ఫోన్లను జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభానికి గంట ముందు ఏజెంట్లు కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో నియమించే సిబ్బందిని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రాండమైజేషన్ పద్ధతిలో నియమిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్ పాల్గొన్నారు.

20 రౌండ్లలో కోడుమూరు అసెంబ్లీ ఫలితాలు

కర్నూలు(సెంట్రల్): వచ్చే నెల 4వ తేదీన ప్రకటించే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కోడుమూరు అసెంబ్లీ ఆర్వో/కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి తెలిపారు. మొత్తం 20 రౌండ్లలో కోడుమూరు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలిసిపోతాయన్నారు. ఈమేరకు కౌంటింగ్‌కు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ..కౌంటింగ్ కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 20 రౌండ్లలో ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. అదే సమయంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం అదనంగా 2 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే కౌంటింగ్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించుకున్నామని, వారి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. కాగా, 30వ తేదీలోపు కౌంటింగ్ ఏజెంట్ల కోసం పోటీ చేసిన అభ్యర్థులు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి మే 24, మే31 తేదీల్లో రెండు విడతలుగా శిక్షణ ఇచ్చి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- నాలుగు జిల్లాల ఎస్పీలకు డీఐజీ ఆదేశం



కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాలుగు జిల్లాల ఎస్పీలకు సూచనలు ఇస్తున్న డీఐజీ విజయరావు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన జరుగుతున్నందున వాటి కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన పకడ్బందీ ఏర్పాట్లపై బుధవారం రేంజ్ పరిధిలోని కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో డీఐజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రోజు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకోవాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏజెంట్లు, అభ్యర్థులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ బాణసంచా నిల్వలు కూడా లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం దాడులు, తనిఖీలు చేపట్టాలన్నారు. అలాగే పెట్రోల్ బంకు నిర్వాహకులు బాటిళ్లు, క్యాన్లలో అమ్మకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ప్రతి జిల్లా సరిహద్దు ప్రవేశ, నిష్క్రమణల దగ్గర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులకు, సిబ్బందికి బందోబస్తు ప్రణాళికకు సంబంధించి బ్రీఫింగ్ చేయాలని సూచించారు. ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయాలని, రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ సుధాకర్‌తో పాటు పలువురు డీఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కల్లూరు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్లకు బుధవారం చిన్నటేకూరు గురుకుల కళాశాలలో బాలురకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. చిన్నటేకూరు, సి.బెళగల్, జూపాడుబంగ్లా, అరికెర గురుకుల కళాశాలలో మిగిలిన 248 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించగా 211 సీట్లు భర్తీ అయ్యాయి. చిన్నటేకూరు, సి.బెళగల్, జూపాడుబంగ్లా కళాశాలల్లో అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. అరికెర కళాశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. చిన్నటేకూరు ఐఐటీ-నీట్ అకాడమీ డైరెక్టర్/ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి, సి.బెళగల్, జూపాడుబంగ్లా, అరికెర కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



చిన్నటేకూరులో వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి వారి ఆరోగ్యం పట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నెలా సక్రమంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. కాన్పు జరిగే రోజులను అంచనావేసి ముందస్తుగానే ఆస్పత్రుల్లో చేరేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదే అన్నారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత లాంటి సమస్యలున్నా, హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రసవ ప్రణాళిక పక్కాగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు గర్భిణులు, బాలింతల ఇళ్లను సందర్శించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. కుటుంబ వైద్య కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి నెలనెలా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే నివారణకు చికిత్స అందించాలన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం ద్వారా గర్భం దాల్చిన మహిళకు మొదటి కాన్పులో రూ.5000 నగదు ప్రోత్సాహం అందిస్తారని వివరించారు. రెండో కాన్పులో ఆడ శిశువు జన్మనిచ్చిన మహిళకు మరోసారి రూ.5000 నగదు ప్రోత్సాహం అందిస్తారని చెప్పారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత వెంకటగిరి ఎద్దులు



బండ లాగుతున్న వెంకటగిరి ఎద్దులు

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన పాలపండ్ల విభాగంఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో మొత్తం వివిధ జిల్లాలకు చెందిన 6జతల ఎద్దులు పోటీపడగా, మండలంలోని వెంకటగిరికి చెందిన క్రిష్ణప్రసాద్ ఎద్దులు 5,900 అడుగుల దూరం బండను లాగి విజేతగా నిలిచాయి. అలాగే ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన సుధాకర్ వృషభాలు రెండో స్థానం, కోడుమూరు మండలంలోని క్రిష్ణాపురం, కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన రామేశ్వరరెడ్డి, చిన్నరత్నం ఎద్దులు 3వ స్థానం, కల్లూరు, వెల్దుర్తి మండలాలకు చెందిన సల్కాపురం, బోయినపల్లె గ్రామాలకు చెందిన వృషభాలు 4వ స్థానంలో నిలిచాయి. ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.15వేలు, రూ.10వేల చొప్పున నగదును దాతల సహకారంతో నిర్వాహకులు పూజారి రంగన్న స్వామి అందజేశారు.

దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు



ఖాదర్‌లింగ స్వామి కట్ట వద్ద జెండా ఆవిష్కరణతో ఫాతెహాలు

కౌతాళం: ఖాదర్‌లింగస్వామి ఉరుసులో భాగంగా బుధవారం ప్రసాదం పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. అలాగే ఖాదర్‌లింగ స్వామి శిష్యులుగా మారడం (గురుబోధ) తీసుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం పలువురు ఖాదర్‌లింగ స్వామి శిష్యులుగా మారారు. శిష్యులుగా మారిన తర్వాత ఎలాంటి చెడు పనులు చేయరాదని, ఐదుపూటల నమాజు చేసి అందరికి మంచి బోధన చేయాల్సి ఉంటుందని ధర్మకర్త మున్నపాషా తెలిపారు. వీరికి తీర్థం అందించి శిష్యులుగా మార్చారు. పీఠాదిపతి ఖాదర్‌బాష చిష్తీ, అలాగే దర్గా పదవ ధర్మకర్త సయ్యద్ సాహెబ్‌పీర్ వుసేని చిష్తీ బోధన గదిపై జెండాను ఎగరవేశారు. ధర్మకర్త మున్నపాషా మాట్లాడుతూ.. దర్గా 10వ ధర్మకర్తగా తన తండ్రి సాహెబ్‌పీర్ వుసేని చిష్తీ 41 ఏళ్ల పాటు సేవలందించారని గుర్తు చేశారు. రెండేళ్లుగా ఆయన బోధన చేసిన గదిపై జెండాను ఎగురవేస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో ఉరుకుంద రస్తాలో ఖాదర్‌లింగస్వామి 40 రోజుల పాటు తపస్సు చేసిన కట్ట వద్ద జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కట్ట వద్ద జెండాను ఆవిష్కరిస్తే వర్షం కురుస్తుందని అపార నమ్మకం ఉందన్నారు. ఇందులో భాగంగానే శిష్యులు, గ్రామస్తులతో కలిసి వెళ్లి జెండా ఆవిష్కరించినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఖవ్వాలి పోటీలను ఘనంగా నిర్వహించారు. గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాషా, గ్రామ పెద్దలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి రగ్బీ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 25 వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో అండర్-18 రగ్బీ క్రీడాంశంలో బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 నుంచి 2009 సంవత్సరాల మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు రూ. 10 దరఖాస్తు రుసుం చెల్లించి నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 వ తేదీన విశాఖపట్నం జిల్లా తిమ్మాపురం (బీమిలీ)లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం నలుగురు డిబార్ అయ్యారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 2,426 మందికి 2,178 మంది, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 8,153 మందికి 7,494 మంది విద్యార్థులు హాజరయ్యారని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నందికొట్కూరు సాయిరాం డిగ్రీ కళాశాలలో 3, నంద్యాల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

గడివేముల: ఎన్నికల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నల్లప్ప హెచ్చరించారు. ఆయన బుధవారం మండలంలోని పెసరవాయి గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లోని అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. ఓట్ల లెక్కింపు తర్వాత గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య వెంట ఉన్నారు.

పొలాల రస్తాను బాగు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్చాల నుంచి సల్కాపు రం వెళ్లే రైతుల పొలాల రస్తాను బాగు చేయా లని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కొట్టుకుపోవడంతో పొలాలకు వెళ్లడానికి రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, వెంకటయ్య, లోకన్న, మద్దిలేటి, సత్యంరెడ్డి, సుధాకర్, మధు, నాగన్న పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత జట్టుకు ట్రోఫీ అందించిన నిర్వాహకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం ఏబీఎం చర్చి 17వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఏపీతో పాటు తెలంగాణ, గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, ట్రోఫీలను దాతల చేతుల మీదుగా అందించారు. విజేత తెలంగాణ(మాలమల్ల) జట్టు రూ.60 వేలు, తరువాతి స్థానాల్లో నిలిచిన ప్యాపిలి జట్టుకు రూ.50 వేలు, ప్రకాశం జట్టుకు రూ.40 వేలు, ప్రకాశం జిల్లా మరో జట్టుకు రూ.30 వేలు, వైఎస్సార్ జిల్లా జట్టుకు రూ.25 వేలు, గుజరాత్ జట్టుకు రూ.20 వేలు, తిరుపతి జట్టుకు రూ.15 వేలు, లక్ష్మీపురం జట్టు రూ.10 వేలు బహుమతులను గెలుచున్నట్లు నిర్వాహకులు రమేష్, కునాల్, వెంకటస్వామి, జాన్, శేఖర్, గంగన్న, గోపాల్, సుంకన్న, బాబ, అభిలాష్, శ్రీకాంత్ తెలిపారు. దాతలను, గ్రామ పెద్దలను చర్చి సంఘ సభ్యులు శాలువాలతో సత్కరించారు. స్థానిక కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, నాగేంద్రబాబు, భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఓర్వకల్లు: చిరుధాన్యాలను సాగు చేయడం వల్ల నేల సారం పెరుగుతుందని, చిన్నకారు రైతులకు నిరంతర ఆదాయం లభించే అవకాశం ఉంటుందని ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ శిక్షకులు వెంకటరమణ, ఖాసీం సాహెబ్ అన్నారు. మండలంలోని హుసేనాపురం, హెచ్.కొట్టాల గ్రామాల రైతులు తమ పొలాల్లో సుమారు 32 రకాల చిరుధాన్యాల పంటలను సాగు చేశారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జన్మభూమి గ్రామైక్య సంఘం సభ్యులు హుసేనాపురంలో వీరభద్రమ్మ బాయికి చెందిన 2 ఎకరాలు, హెచ్ కొట్టాలలో ఎకర పొలంలో చిరుధాన్యాలను సాగు చేశారు. ఈ పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో భీజామృతంతో విత్తన శుద్ధి చేసి నవధాన్యాలను సాగు చేయడం జరిగిందన్నారు. ఈ విధానంతో మంచి దిగుబడులను సాధించడంతో పాటు, ఏడాది కాలంలో అన్ని రకాల పంట ఉత్పత్తులను పొందడమేగాక, నిరంతర లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి జుబేర్, లక్ష్మినారాయణ, శ్రీకాంత్, హుసేన్‌సాహెబ్, నాగమణి, సోమేశ్వరి, రామలక్ష్మి, భాస్కర్, సుధీర్, ఐసీఆర్‌పీలు పుల్లయ్య, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

25న చర్చి ప్రారంభోత్సవం



నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం ఈ నెల 25న ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘ పెద్దలు బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు పరిశుద్ధ ఆలయ ప్రతిష్ట మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి రాయలసీమ అధ్యక్ష మండల బిషప్ ఐజక్ వరప్రసాద్ హాజరవుతారని చెప్పారు. ప్రతిష్ట సందర్భంగా పలు కార్యక్రమాల చేపట్టామన్నారు. 25న రాత్రి చెక్కభజన, కోలాటం ఉంటుందని వెల్లడించారు. 26న ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల జట్లు ఎంట్రీ ఫీజు రూ.400 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 27వ తేదీన న్యూ కేటగిరి విభాగంలో వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను ప్రై వేట్ సంస్థలకు అప్పగించేందుకు చేస్తున్న ప్ర యత్నాలను విరమించుకోవాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డి మాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఆర్‌టీఏ కార్యాలయాలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు పూనుకోవడం అన్యాయమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేసే ప్రక్రియను ప్రైవేట్ సంస్థలు పొందితే డబ్బులకు లైసెన్స్‌లను అమ్ముకుంటారని, తక్షణమే ఆ విధానాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేష న్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు వేయించండి



ఆవుకు టీకా వేస్తున్న పశు వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి

కల్లూరు: పశువులు, గొర్రెలలో వాతావరణ మార్పుల వల్ల వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని చిన్నటేకూరు పశువైద్యుడు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం వివిధ గ్రామాల్లో పశువులకు జబ్బ వ్యాధి రాకుండా బీ క్యూ వ్యాక్సిన్, గొర్రెలకు చిటుక వ్యాధి నివారణకు ఈటీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురిసే సమయంలో పశువులు, గొర్రెలకు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలను వేయించాలని పాడి రైతులు, గొర్రెల యాజమానులకు సూచించారు. 4–6 మాసాల వయసున్న ప్రతి పశువులకు టీకాలు వేయించవచ్చని చెప్పారు. చిన్నటేకూరు పశు ఆస్పత్రి పరిధిలో ఇప్పటివరకు 350 పశువులకు బి.క్యూ వ్యాక్సిన్, 900 గొర్రెలకు ఈటీ వ్యాక్సిన్ పూర్తి వేసినట్లు తెలిపారు.